రానున్న మూడు రోజులు జిల్లాకు భారీ వర్ష సూచన

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళా ఖాతంలో ఏర్పడిన ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని, వచ్చే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ కలెక్టరేట్ కంట్రోల్ రూం నెంబరు 08922-236947కు సమాచారం అందజేయాలని ఆదేశించారు.

బార్లు.. బోర్లా!





- అనుకున్నంత పనిచేసిన బార్ల యజమానులు
- ఆశించిన స్థాయిలో రాని దరఖాస్తులు
- 14 బార్లకే లాటరీ
- కొంపతీసిన మద్యం దుకాణాల పర్మిట్‌రూంలు
- గీత కార్మికుల బార్లకు మాత్రం డిమాండ్

రాజాం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బార్ల యజమానులు అనుకున్నంత పనిచేశారు.. రండి బాబూ రండి .. దరఖాస్తు చేయండి అని ఎక్సైజ్‌శాఖ అధికారులు విజ్ఞప్తులు చేసినా బార్ల నిర్వాహకులు పట్టించుకోలేదు.. ఇప్పటికి జరిగింది చాలు.. ఇంకా చేతులు కాల్చుకోవాలా అంటూ ముందుకు రాలేదు. తాజా నిబంధనలు, వైన్‌షాపులకు పర్మిట్‌రూంలు ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన పుణ్యమాని బార్లకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పడిపోయింది. దీంతో చేసేదిలేక జిల్లా అధికారులు వచ్చిన దరఖాస్తులనే పరిశీలించి ఆగస్టు 30న లాటరీ వేసి మమ అనిపించేశారు.

జిల్లాలో జనరల్ కేటగిరీ కింద 28 బార్లు, గీత కార్మికులకు 3 బార్లు కేటాయిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గతానికి భిన్నంగా లాటరీ ద్వారా బార్లు కేటాయిస్తామని ప్రకటించింది. ఇదే సమయంలో ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ ప్రాతిపదికన బార్లు కేటాయిస్తామని స్పష్టం చేసింది. అయితే 31 బార్లకు 72 దరఖాస్తులు వచ్చినా కేవలం 14 బార్లకు మాత్రమే జిల్లా యంత్రాంగం లాటరీ నిర్వహించింది. మిగిలిన 17 బార్లకు సంబంధించి నాలుగేసి దరఖాస్తులు రాకపోవడంతో వాటి విషయంలో ఏం చేయాలనేది జిల్లా యంత్రాంగం ఇంకా స్పష్టం చేయలేదు..

గీత కార్మికులకు కేటాయించిన బార్లకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో మూడు బార్లను ఈ కేటగిరీకి కేటాయించగా.. విజయనగరం బార్‌కు 13 దరఖాస్తులు వచ్చాయి. రాజాం బార్‌కు 8 దరఖాస్తులు అందాయి. నెల్లిమర్ల నగర పంచాయతీలో గీత కార్మికులకు కేటాయించిన బార్‌కు కేవలం ఒకే ఒక్క దరఖాస్తు రావడంతో అక్కడ జిల్లా యంత్రాంగం ఎవరికీ బార్‌ను కేటాయించలేదు. ఒక్కో బార్‌కు దరఖాస్తుతో పాటు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజ్ చెల్లించాలన్న ప్రభుత్వ నిబంధన కూడా బార్ నిర్వాహకుల కాళ్లకు బంధం వేసింది.

ఎందుకిలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బార్ల కేటాయింపునకు సంబంధించి మూడేళ్ల కాలానికి వేలం పాట నిర్వహించారు. అప్పట్లో జిల్లా కేంద్రంలో ఒక్కో బార్‌కు రూ.44 లక్షల ధర పలకగా, రాజాంలో అత్యధికంగా మద్యం వ్యాపారులు రూ.88 లక్షలకు పాడి మూడు బార్లను ముగ్గురు వ్యాపారులు దక్కించుకున్నారు. బొబ్బిలిలో సైతం రూ.50 లక్షలకు పైగా బార్ ధర పలికింది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో రాజాం, బొబ్బిలి (మిగతా 8వ పేజీలో..)

పైడిమాంబ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు
- ఆలయ మార్యాదలతో స్వాగతం



గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు దంపతులకు పైడిమాంబ చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో శిరీష

విజయనగరం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు చెప్పారు. సోమవారం ఉదయం 11.15 గంటల ప్రాంతంలో నగరంలోని పైడిమాంబ ఆలయానికి అశోక్‌గజపతి రాజు గవర్నర్ హోదాలో తొలిసారిగా వచ్చారు. ఆయన వెంట సతీమణి సునీలా గజపతిరాజు ఉన్నారు. ఈవో శిరీష, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం అశోక్ గజపతిరాజు దంపతులు అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా ఆలయ బయట ఆయన విలేకర్లతో మాట్లాడారు. పైడిమాంబ ఆలయ విస్తరణకు సంబంధించి ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందని, స్థల సేకరణ పూర్తయిందని (మిగతా 8వ పేజీలో..)

సిరిమాను జాతరకు పక్కా ఏర్పాట్లు

- రూ.59.70 లక్షలతో అభివృద్ధి పనులు
- కమిషనర్ నల్లనయ్య



విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేస్తామని, రూ.59 లక్షల 70 వేలతో అభివృద్ధి పనులు చేపడ్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం తన చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ జాతరను పురస్కరించుకుని అక్టోబరు 6, 7, 8 తేదీల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. రూ.లక్షా 85 వేలతో పండుగ మూడు రోజులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి పంపిణీకి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రూ.4 లక్షల 20 వేలతో వివిధ ప్రాంతాలు, జంక్షన్‌లలో ఉండే ఫౌంటేన్లకు మరమ్మతులు చేపడ్తామని, రూ.9 లక్షల 70 వేలతో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రూ.10 లక్షల 65 వేలతో నగరంలోని రహదారులపై డివైడర్లను, బుద్ధుని విగ్రహం నుంచి సీఎంఆర్ జంక్షన్ వరకూ, అలాగే రామారాయుడు రోడ్డు, సంతకాల వంతెన, నీలాచెరువు ప్రాంతాల్లో పెయింటింగ్స్ వేయనున్నట్టు చెప్పారు. రూ.16 లక్షలతో విద్యుత్ దీపాలంకరణకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రూ.4 లక్షల 60 వేలతో డివైడర్‌లపై (మిగతా 8వ పేజీలో..)

అనుమతి లేక.. నిబంధనలు పాటించక

- యథేచ్ఛగా డీజేల వినియోగం
- వినాయక నిమజ్జనాల్లో నిబంధనలు బేఖాతర్
- ప్రకటనలకే నిషేధం పరిమితం
- చోద్యం చూస్తున్న పోలీసుల యంత్రాంగం

6లో



అర్జీదారుల సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌లో 188 వినతులు

6లో

ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రైవేటు హాస్పిటల్స్, రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ క్లినిక్స్ ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ కోసం నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టరు జీవనరాణి సూచించారు. ఏఆర్‌టీ క్లినిక్ లెవల్-1కు రూ.50 వేలు, లెవల్-2 క్లినిక్‌కు రూ.2 లక్షలు, ఏఆర్‌టీ బ్యాంకుకు రూ.50 వేలు, సరోగసి క్లినిక్‌కు రూ.2 లక్షలు డీడీ తీయాలన్నారు. జిల్లాలో మూడు ఫెర్టిలిటీ కేంద్రాలు మాత్రమే సెంట్రల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరైనా కేంద్రాన్ని నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాల్లో ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్టయితే లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టం అనుసరించి అనుమతులు పొందాలన్నారు.

నిరుపేదలకు అండగా అన్నా క్యాంటీన్

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అతి తక్కువ ఖర్చుతో మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగా నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోనూ అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయం పక్కన అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో మేజర్ పంచాయతీల్లో అన్నాక్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంతవరకు రాష్ట్రవ్యాప్తంగా 64 మేజర్ పంచాయతీల్లో ఏర్పాటు చేసిందని, విజయ నగరం జిల్లాలో ఇప్పటికే మూడు అన్నా క్యాంటీన్లు ఉండగా కొత్తగా గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస పంచాయతీల్లో సుమారు రూ.60లక్షల నుంచి 65 లక్షలతో భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల (మిగతా 8వ పేజీలో..)



అన్నా క్యాంటీన్ భవన శంకుస్థాపనలో మంత్రి శ్రీనివాస్

గంజాయి మత్తులో దాడి

- వైద్య విద్యార్థిపై నలుగురు యువకుల వీరంగం
- వెంబడించి దాడి
- అదుపులో నిందితులు?



దాడిపై సీసీ పుటేజీలో లభ్యమైన ఫొటో

రాజాం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండలంలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ యువకులు పట్టుబడిన ఘటనను ఈ ప్రాంతీయులు మరచిపోకముందే గంజాయి మత్తులో దాడి ఘటన జరగడం స్థానికంగా సంచలనమైంది. రాజాం పట్టణంలో గంజాయి సేవించిన నలుగురు యువకులు ఓ వైద్య విద్యార్థిని ఆదివారం రాత్రి వెంబడించి దాడి చేశారు. ఈ ఘటనతో రాజాం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తరచూ గంజాయితో సంబంధం ఉన్న ఘటనలు చోటుచేసుకోవడం చూసి ఆశ్చర్యపోతున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రాజాం పట్టణానికి చెందిన శివమణి జార్జియాలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఇటీవల సెలవులకు రాజాం వచ్చిన ఆయన ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం రోడ్‌లోని బాలాజీ టెంపుల్ నుంచి డోలపేట వైపు వెళ్తుండగా ఓ బ్యాకరీ వద్ద నుంచి నలుగురు యువకులు గంజాయి మత్తులో (మిగతా 8వ పేజీలో..)

హెల్మెట్ తీసుకుని కొట్టారు

- శివమణి, బాధితుడు



నేను ఫారిన్‌లో మెడిసిన్ చదువుతున్నాను. రాజాం వచ్చిన నేను శ్రీకాకుళం రోడ్‌లోని బాలాజీ టెంపుల్‌కి వెళ్లి వస్తుంటే నలుగురు యువకులు స్కూటీపై నన్ను వెంబడించారు. డోలపేట రోడ్‌లోని లక్కీ షాపింగ్ మాల్ వద్ద నన్ను ఆపి నా హెల్మెట్ తీసుకుని ఇష్టారాజ్యంగా కొట్టారు. వాళ్లంతా గంజాయి సేవించి ఉన్నట్లు అక్కడి వారంతా చెప్పారు. ఫారిన్‌లో కూడా ఇలా ఎప్పుడూ జరగలేదు. ఇండియా వచ్చాకే ఇలా జరిగింది. రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాను.

గజరాజుల కదలికలపై పరిశీలన

- రంగంలోకి అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి
- కేంద్ర బృందం అధ్యయనం



ఏనుగులు సంచరించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బృందం

కొమరాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమడ గ్రామ సమీపంలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాన్ని సోమవారం అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి శాంతి ప్రియపాండే బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు గజరాజులు ఎక్కువగా ఎటువంటి ప్రాంతాల్లో ఉండడానికి (మిగతా 8వ పేజీలో..)

కోళ్లు.. రైతు కంట కన్నీళ్లు

- అంతుచిక్కని వ్యాధితో మరణం
- కొత్తవలస పౌల్ట్రీ జోన్‌లో లక్షల్లో ప్రాణాలొదిలిన వైనం
- నమూనాలను ల్యాబ్‌కు పంపించామన్న అధికారులు



కొత్తవలసలోని ఓ ఫారంలో మృత్యువాత పడిన బ్రాయిలర్ కోళ్లు


కొత్తవలస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అంతుచిక్కని వ్యాధితో వారం రోజులుగా ఫారాల్లో పెంచుతున్న కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. నిన్నటివరకు బాగానే తిరుగాడిన కోడి ఉన్నట్టుండి నేలవాలిపోతోంది. కొత్తవలస పౌల్ట్రీ జోన్‌లో లక్షల్లో ప్రాణాలొదిలాయి. దీంతో వీటిని పెంచడం ద్వారా ఉపాధి పొందుతున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధిని నిర్ధారించేందుకు ఇప్పటికే కొత్తవలస పశు సంవర్ధకశాఖ అధికారులు నమూనాలను విజయవాడ ల్యాబ్‌కు పంపించారు.

కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి గేట్ దాటిన తరువాత వియ్యంపేట నుంచి కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలతో పాటు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోళ్లఫారాలు కలిపి కొత్తవలస పౌల్ట్రీజోన్‌గా కొనసాగుతోంది. ఈ జోన్‌లో వియ్యంపేట, దేవాడ, రామలింగపురం, చీడివలస, ముసిరాం, కళ్లేపల్లి, రేగ, కుమ్మపల్లి దీక్షతుల అగ్రహారం, కొరువాడ, లంకవానిపాలెం, పిండ్రంగి, ఆనందపురం,దేవరాపల్లిపాటు వివిధ గ్రామాల్లో పౌల్ట్రీఫారాలను ఏర్పాటు చేసుకుని బ్రాయిలర్ కోళ్ల పెంపకాన్ని చేపట్టారు. కోళ్లను 45 రోజుల నుంచి 50 రోజుల వరకు పెంచాక ఎగుమతి చేసే సమయంలో ఈ అంతు చిక్కని వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి.

పౌల్ట్రీలో చదరపు అడుగుకు ఒక కోడి చొప్పున పెంచుతుంటారు. కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్న రైతులు స్నేహ, వెంకటేశ్వర, ఎస్ఆర్ వంటి హేచరీస్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం రైతులకు హేచరీస్ యజమానులు కోడిపిల్లలను(చిక్స్)ను పంపిణీ చేస్తారు. మేతను కూడా హేచరీస్ యజమానులే (మిగతా 8వ పేజీలో..)

అనుమతి లేక.. నిబంధనలు పాటించక

- యథేచ్ఛగా డీజేల వినియోగం
- వినాయక విగ్రహాల నిమజ్జనాల్లో నిబంధనలు బేఖాతర్
- ప్రకటనలకే నిషేధం పరిమితం
- చోద్యం చూస్తున్న పోలీసుల యంత్రాంగం



- గత ఏడాది వినాయక చవితి వేడుకల్లో రాజాం మండలం లోని పొనుగుటివలసకు చెందిన ఓ యువకుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. రాత్రంతా డిజే సౌండ్స్‌కు డ్యాన్స్ వేసిన యువకుడు నిద్రించే సమయంలో గుండెపోటుతో చనిపోయాడు.
- గత ఏడాది వినాయక నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న గరివిడి ఫేకర్ పరిశ్రమ కాలనీకి చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. రాత్రి డిజే సౌండ్స్‌కు డ్యాన్స్ చేసిన యువకుడు ఇంటికి వెళ్లి గుండె పోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతిచెందాడు.

రాజాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని వినాయక చవితి ఉత్సవాల్లో డీజేల వినియోగం భారీగా పెరిగింది. నిర్వాహకులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. వీటి వినియోగం నిషేధిస్తున్నట్లు ప్రకటనలు అటకెక్కిపోయాయి. బహిరంగంగా వినియోగిస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యంచూస్తోంది. వీటి వల్ల అనర్థాలు చోటచేసుకునే అవకాశ ముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం వాడవాడలా వినాయక నవరాత్రి వేడుకలు జరుగుతున్నాయి. అక్కడక్కడ నిమజ్జనోత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. అయితే డీజేలు నిషేధించినట్లు పోలీస్ శాఖ చెబుతున్నా, అవి ప్రకటనలకే పరిమితమయ్యాయి. కొందరు అనుమతి లేకుండా యథేచ్ఛగా డీజేలను వినియోగిస్తున్నారు. దీంతో వృద్ధులు, గుండె, శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు తప్పని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా మానవుని చెవి 120 నుంచి 130 డెసిబుల్స్ మాత్రమే భరించగలవు. అంతకు శబ్దం మించితే పెను ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం వింటున్న శబ్దం తీవ్రత పెరిగే కొద్ది రుగ్మతలు ఖాయమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

70 డెసిబుల్స్‌లోపు వింటే..

70 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. 100 డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110 డెసిబుల్స్ దాటితే చికాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది. 120 డెసిబుల్స్ దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తలబాధ వస్తుంది. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్స్ దాటితే కర్ణభేరి పగిలి పోతుంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు. పూర్వపు స్థితి రావడం చాలా కష్టం.

అనుమతులకు మించి..

నిబంధనల ప్రకారం 70 డెసిబుల్స్ సౌండ్ వరకూ మాత్రమే అనుమతి ఉంది. అంతకు మించితే చట్టరీత్యా నేరం. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకూ భారీ శబ్దాలతో ఊరేగింపులు, వేడుకలు నిర్వహించే విషయం నిషేధించిన విషయం విదితమే. ఆస్పత్రులు, పాఠశాలలు, కోర్టులను నిశ్శబ్ద జోన్లుగా పరిగణిస్తారు. కానీ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వినాయక చవితి వేడుకల్లో ఏర్పాటుచేస్తున్న డీజే సిస్టమ్స్ సౌండ్ 200 డెసిబుల్స్ దాటి ఉంటోంది. భారీ సౌండ్స్ ప్రజల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. కానీ పోలీస్ శాఖ ప్రకటనలకే పరిమితం అవుతోందన్న విమర్శలున్నాయి.

కొత్త కొత్త రీతిలో..

డీజే సౌండ్ సిస్టమ్స్‌లో కూడా సరికొత్తవి అందు బాటులో ఉన్నాయి. వాన పాటలు కోసం ఒకలా.. డ్యాన్స్ వేస్తున్న వారిపై నీరు పడేలా కొన్ని పరికరాలను అమ ర్చుతున్నారు. అదే నీటిలో రసాయ నాలు సైతం కలుపుతున్నారు. ఇది డ్యాన్స్ వేసేవారికి చాలా ప్రమా దకరం. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్ కూడా చాలా ప్రమాద కరం. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రుగ్మతలు ఉన్నవారిపై విపరీతంగా ప్రభావం చూపిస్తుంది. ఆ వైబ్రేషన్‌తో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడుకు రక్త సరఫరా తగ్గిపోతుంది. గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు మూసుకుపోతాయి. గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భిణులకు సైతం డీజే వైబ్రేషన్స్ ప్రమాదకరమే. అధిక శబ్దాలు వింటే గర్భస్థ పిండంపై పెను ప్రభా వం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే అటువంటి ప్రమాదకరమైన డీజేలను నిషేధించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. కానీ డీజేల వినియోగం జిల్లాలో యథేచ్ఛగా సాగు తోంది. దీనిపై పోలీస్ శాఖ దృష్టిసారించాల్సిన అవసరముందని నిపుణులు సూచిస్తున్నారు.

డీజేలపై నిషేధం

వినాయక నవరాత్రి వేడుకలకు అనుమతి తప్ప నిసరి చేశాం. అధిక శబ్దాలు వచ్చే డీజేలు విని యోగించకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. నిమ జ్జనోత్సవాలు కూడా రాత్రి పది గంటలకు ముగిం చాలి. లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్స్ ఇష్టారాజ్యంగా వినియోగిస్తామంటే కుదరదు. ఈ విషయంలో గణేష్ మండపాల నిర్వహకులకు ఆదేశాలిచ్చాం.

-హెచ్.ఉపేంద్ర, రూరల్ సీఐ, రాజాం

డీజే శబ్దాలతో ప్రమాదకరం

డీజేల శబ్దాలు చాలా ప్రమాదకరం. ఎక్కువ డెసిబుల్ శబ్దం కలిగించే డీజేల వల్ల అనర్థాలు అధికం. వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు ఉత్పన్నమవుతాయి. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్దం వింటే పెను ప్రభావం చూపుతుంది. చిరాకుతోపాటు విపరీతమైన కోపం, తలనొప్పికి కారణమవుతాయి. అందుకే డీజే సిస్టమ్‌ల వద్దకు వెళ్లకపోవడం ఉత్తమం.

-మంజేటి కోటీశ్వరరావు, వైద్యుడు,రాజాం

వచ్చే విద్యా సంవత్సరానికి గిరిజన వర్సిటీ భవనాలు సిద్ధం

- మంత్రి కొండపల్లి



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నాటికి దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో నిర్మాణంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ భవనాలు వినియోగానికి సిద్ధమవుతాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం వీసీ టి.శ్రీనివాసన్‌తో మంత్రి శ్రీనివాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాటాడుతూ 2027 జూన్ నాటికి మొత్తం ఫేజ్-1 పనులు పూర్తికానున్నాయని తెలిపారు. ప్రస్తుత భవనాల నిర్మాణం, ఇతర అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజేంటేషన్‌ను వీక్షించారు. యూనివర్సిటీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీకి విద్యుత్, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ప్రస్తుతం ఇక్కడి క్యాంపస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న తరగతులు, గ్రూపులు, విద్యార్థులకు వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. యూనివర్సిటీ భవన నిర్మాణాన్ని నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త భవనాల్లో తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మిశ్రా, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ వీకే దాస్, డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ఏవో డాక్టరు ఎన్వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు



సాలూరు రూరల్: గొల్లవీధి గణష్ మండపం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం



వీరఘట్టం: రథంపై సూర్యభగవానుడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాలో వినాయక నవరాత్రులు కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువదీరిన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఐదో రోజు పలుచోట్ల నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

వీరఘట్టం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూరాకులవీధికి చెందిన శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం వినాయక నిమజ్జనం పురస్కరించుకుని ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా బండ్ల వేషాలతోపాటు వివిధ రకాల అలంకరణలతో సందడిచేశారు. వీరఘట్టం మండలంతోని పలు గ్రామాలతోపాటు వంగర, జియ్యమ్మవలస మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఊరేగింపును తిలకించారు.

విద్యుత్ దీపాలతో మండపాల అలంకరణ..

సాలూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన మండపాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 1600 పైబడి గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. ఆయా మండపాలను వివిధ శైలిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండపాలను దర్శించుకున్న భక్తులకు విద్యుత్ దీపాల అలంకరణ అలరిస్తున్నాయి. మండపాలకు విద్యుత్ దీపాల ఏర్పాటు వల్ల ఎలక్ట్రీషియన్లు ఉపాధి పొందుతున్నారు.

గణనాథుని సేవలో భవానీ భక్తులు..

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని కొత్తవలస పెద్దవీదిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేష్ యూత్ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించిన గణనాథుడు పూజలందుకుంటున్నాడు. రథంపై అధిరోహించిన గణనాథుడు భక్తులను అలరిస్తున్నాడు. సోమవారం సాయంత్రం భవానీ భక్తులు భక్తి పాటలతో భజనలు చేస్తూ పూజలు నిర్వహించారు. అలాగే కొత్తవలస పెదవీదిలో కొత్తపోలమ్మ యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన వరసిద్ధి వినాయకుడిని పలువురు దర్శించుకున్నారు.



పార్వతీపురం టౌన్: భజనలు చేస్తున్న భవానీలు

వినాయకుడికి 108 రకాల నైవేద్యం..

కురుపాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కురుపాంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపం వద్ద వినాయకుడికి సోమవారం 108 రకాల నైవేద్యాన్ని భక్తులు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు,భక్తులు పాల్గొన్నారు.



వినాయకుడు వద్ద 108 రకాల ప్రసాదాలతో పూజలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

భక్తి భావంతో పండుగలు జరపాలి

- కలెక్టర్, ఎస్పీ వెల్లడి

పార్వతీపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పవిత్రత, భక్తి భావంతో పండుగలు జరుపుకోవాలని, ఆ సమయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మత పెద్దలతో వారు మాట్లాడుతూ.. వివిధ రకాల సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవు పార్వతీపురం మన్యం జిల్లా అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో వారి ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలన్నారు. గ్రామ దేవతల ఉత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలు, అశ్లీల నృత్యాలు నిషేధమని వెల్లడించారు. ఈ నెల 9లోగా గణేష్ నిమజ్జనోత్సవాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురుస్తున్నందున నదులు గెడ్డలు, వాగులు ఎవరూ దిగకుండా చూసుకోవాలన్నారు. ఏఎస్పీ అంకితా సురాన, తహసీల్దార్ సురేష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో విజృంభిస్తున్న చికున్‌గున్యా

- సీతంపేట ఏరియా ఆసుపత్రిలో పెరుగుతున్న రోగులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో చికున్‌గున్యా విజృంభిస్తోంది. ఎపడిమిక్ సీజన్ ప్రారంభం నుంచి మలేరియా జ్వరాలతో పాటు చికున్‌గున్యా జ్వరపీడితులు పెరుగుతున్నారు. ప్రధానంగా చికున్‌గున్యా బాధితులు జ్వరం, అలసట, కీళ్లనొప్పులు, పాదాల వాపులు వంటి లక్షణాలతో అవస్థలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోగులు పెరుగుతున్నారు. సోమవారం ఒక్కరోజు ఓపీ 316 వరకు నమోదైంది. ఇందులో వైరల్, చికున్‌గున్యా జ్వరపీడితులు 68 వరకు ఉన్నారు. ఇక జ్వరాలతో బాధపడుతు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా 33మంది చేరగా ఒక మలేరియా పాజిటివ్ కేసు నమోదైంది. జ్వరపీడితులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

అర్జీదారుల సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌లో 188 వినతులు



మాట్లాడుతున్న అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు న్యాయం చేయాలని, వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పీజీఆర్ఎస్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు త్వరలో పీజీఆర్ఎస్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అసలైన ఫిర్యాదు దారులకు న్యాయం చేకూర్చే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. పరిష్కరించేలేని పక్షంలో కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్‌పై సీఎం కార్యాలయంలో నుంచి ప్రతి నెలా విశ్లేషణ నిర్వహిస్తారని, దీంతో అధికారులంతా వచ్చిన వినతులు పరిష్కారంపై చిత్త శుద్ధి చూపించా లన్నారు. ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో అన్నిశాఖల వారి ముఖ్యమైన శాఖా మెమోలు, ప్రభుత్వ ఉత్తర్వులు కాపీలు వచ్చే గురువారంలోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కాగా జిల్లాలోని వివిధ సమస్యలపై 188 వినతులొచ్చాయి.ఇందులో రెవెన్యూ శాఖకు 64 వినతులు అందాయి. కార్యక్రమంలోని జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాచిపెంట మండలంలో విలీనం చేయాలి..

మెంటాడ మండలంలోని ఆరు పంచాయతీ పరిధిలో ఉన్న 50 గిరిజన గ్రామాలను పాచిపెంట మండలంలో విలీనం చేయాలని గిరిజనులు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. మెంటాడ మండలం ప్లెయిన్ మండలం పరిధిలో ఉండడంతో ఆయా గ్రామాలకు ఐటీడీఏ నిధులు అందలేదని పేర్కొన్నారు. దీని దృష్ట్యా పాచిపెంటకు విలీనం చేస్తే తమకు న్యాయం జరుగుతుందని గిరిజనలు కోరారు.

ప్రశాంతమైన జిల్లాగా పేరు నిలబెడదాం..

విజయనగరం జిల్లా చాలా ప్రశాంతమైనదని, ఆ పేరును నిలబెట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబి పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా సహకరించాలని తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ చిన్నపొరపాటు జరిగినా వెంటనే పోలీసులుకు తెలియజేయాలని సూచించారు. ఏదైనా అసత్య ప్రచారం సోషల్ మీడియా ద్వారా లేదా వాట్సాప్ గ్రూపుల్లో తెలుసుకుని ఆవేశపడి గొడవలు చేయకుండా పోలీసులకు తెలియజేయాలన్నారు. జేసీ సేతుమాదవన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని, రానున్న రోజుల్లో కూడా కొనసాగించాలని సూచించారు. రెవెన్యూ, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు జట్టుగా సమన్వయంతో ఉండాలని, పండగలు శాంతియువత వాతావరణంలో జరిగే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, మైనార్టీ అధికారి కుమారుస్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుస్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 25 ఫిర్యాదులు స్వీకరించారు. భూతగాదాలకు సంబంధించి ఐదు, కుటుంబ కలహాలకు సంబంధించి ఎనిమిది, మోసాలకు పాల్పడినట్టు ఆరు ఇతర అంశాలకు సంబంధించి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఏడు రోజుల్లో ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్బీ సీఐ లీలారావు, డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అశోక్‌ను కలిసిన ఉన్నతాధికారులు


గవర్నర్ అశోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్/ క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును కలెక్టర్ డా.బీఆర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేతు మాధవన్‌లు సోమవారం కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అశోక్‌ను విజయనగరంలోని ఆయన బంగ్లాలో వీరు కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. పలు అంశాలపై కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పలువురు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణ కోసం బీసీ కులాలు పోరాటం చేసేందుకు ముందుకు రావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. నగరంలో ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ 139 కులాల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రజలందరి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, బుజ్జిబాబు, హరిప్రసాద్, గువ్వల ప్రసాద్, సబ్బి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రతిభను వెలికితీసేందుకు కొత్త ఆవిష్కరణలు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను వెలికి తీసేందుకు కొత్త ఆవిష్కరణలకు వేదికగా డేవ్ అస్ట్రా క్లబ్‌ను ఏర్పాటు చేశామని జేఎన్‌టీయూ వీసీ డి.రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి అరుణకుమారి ఈ క్లబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకత, పరిశోధనాత్మకత దృక్పథంలో ముందుకు సాగి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు తీసుకురావడం ఈ క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కాలనీలో మౌలిక వసతులు కల్పించరా?

విజయనగరం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించకుండా కాలయాపన చేయడం ప్రభుత్వానికి తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ముగడ అశోక్ ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఎస్.కోట నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గేదెల అప్పలరాజు నేతృత్వంలో కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జామి మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పేదల కాలనీలో ఇళ్లకు కరెంటు, వీధి లైట్లు, తాగునీటి కుళాయిలు, రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం కలెక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎస్ఐడీసీ డైరెక్టర్‌గా కోటగిరి

రాజాం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఐడీసీ) డైరెక్టర్‌గా రాజాం పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు కోటగిరి నారాయణరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన బీజేపీలో వివిధ పదవులు చేపట్టారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తనను ఎస్ఐడీసీ డైరెక్టర్‌గా నియమించిన ప్రభుత్వానికి, సహకరించిన ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్.కోటలో డ్రైనేజీ నిర్మాణంపై ఎమ్మెల్యే సమీక్ష

ఎస్.కోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దేవీబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగుతున్న డ్రైనేజీ నిర్మాణంపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పనులు నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న మాట్లాడుతూ పనుల వద్ద ప్రతిరోజూ ఏదో ఒక గొడవ జరుగుతుందని వాపోయారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలకు ఉపయోగకరమైన పనుల వద్ద ఎవరైనా ఆటంకాలు కలిగిస్తే ఉపేక్షించవద్దని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్‌లను ఆదేశించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, పార్టీ మండల కార్యదర్శి రామసత్యం పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని అగురు వీధి రక్షిత నీటి పథకం పైపులైన్ మరమ్మతులకు గురయ్యింది. ఈ పైపులైన్‌ను నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం సోమవారం సందర్శించారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ పథకం పరిధిలోని ఆగురువీధి, జంగాలవీధి, సునాని వీధి, బైరెడ్డి వీధి, ఎరుకుల వీధి, నాయుడుకాలనీ ప్రాంతాలకు రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

- మంత్రి శ్రీనివాస్
- జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ

దత్తిరాజేరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై వైసీపీ చేస్తున్న ప్రచారాలు అన్నీ అవాస్తవాలని, రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోరపుకృష్ణాపురంలో ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సోమవారం 2 లక్షల 76వేల 162 పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే దత్తిరాజేరు మండలంలో రూ.20కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు బోడసింగి సత్తిబాబు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వంగపండు కృష్ణమూర్తినాయుడు, ప్రధాన కార్యదర్శి చెల్లూరి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

● కోరపుకృష్ణాపురంలో పలువురికి మంత్రి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. పెదమానాపురానికి చెందిన భోగాపురపు శివరామకృష్ణకు రూ.43,795, వి.కృష్ణాపురానికి చెందిన మర్రిపిన శంకరరావుకు రూ.35,582, కోమటిపల్లికి చెందిన బి.రవికుమార్‌కు రూ.30వేల చెక్కులు అందజేశారు.

● విజయనగరం రూరల్: నగరంలోని ఆరో డివిజన్ జమ్ము ప్రాంతంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

● లక్కవరపుకోట: సామాజిక పింఛన్లు అందరికీ అందిస్తామని, ఏ ఒక్కరి పింఛన్ తీయలేదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. పోతంపేట, లచ్చమ్మపేట గ్రామాల్లో ఆమె సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. వైసీపీ దుష్ప్రచారం నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● భోగాపురం: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తుందని ఎవరూ అధైర్య పడొద్దని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని రాజాపులోవ, చెరుకుపల్లి, గుడివాడ గ్రామాల్లో ఆయన సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు.

● రాజాం: దేశంలో పింఛన్లు ఒకేసారి పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుదేనని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మునిసిపాల్టీ పరిధిలోని పుచ్చలవీధిలో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కమిషనర్ జె.రామప్పలనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


దత్తిరాజేరు: దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్


విజయనగరం రూరల్: పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి


లక్కవరపుకోట: పింఛన్ అందిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి


రాజాం: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు చంద్రబాబు

- ముఖ్యమంత్రికి అంతటా అభినందనలు

గజపతినగరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 13మందికి మంజూరైన రూ.13లక్షలు విలువగల చెక్‌లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లు కావడంతో ఎంతో అభినందనీయమన్నారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు, ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ, రోడ్లు, విద్యుత్, పీ-4 విధానంతో ప్రజలకు మంచి సేవలు అందించాలన్న ఆలోచన చేస్తూ అమలు పరుస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ వీవీవీ గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, దత్తిరాజేరు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరనాయుడు, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, కొప్పలవెలమ సంఘం రాష్ట్ర డెరక్టర్ అల్లు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి నాయకుడు చంద్రబాబు

చీపురుపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మూడు దశాబ్దాల బాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసి, ప్రపంచ స్థాయి నాయకుడిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి రంగాలకు సమానమైన ప్రాధాన్యతనిస్తూ చంద్రబాబు పాలన సాగించిన తీరు దేశానికి ఆదర్శమయ్యిందన్నారు. టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ఇజరోతు రాంబాబు, శనపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నేల గర్వించదగ్గ నేత..

లక్కవరపుకోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు నేల గర్వించదగ్గ నాయకుడు నారా చంద్రబాబునాయుడని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా మొదటిసారి 1995లో ప్రమాణస్వీకారం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆమె తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి, ఐటీ, డ్వాక్రా, దీపం, ప్రజల వద్దకు పాలన, నీరు-చెట్టు, పీ-4 ఇలా అనేక నూతన కార్యక్రమాలను సృష్టించి పరిపాలనలో నూతన ఒరవడి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు.

జన్మభూమితో గ్రామ స్వరాజ్యం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చిన జన్మభూమితో గ్రామ స్వరాజ్యం సాధ్యమయ్యిందని డీసీసీబీ చైర్మన్ నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా అభ్యున్నతి కోసం ప్రత్యేక చట్టాలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. పీ-4 విధానాన్ని అమలు చేయడం, అమరావతి నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

రాజాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నేటికి 30 ఏళ్లు అయిన సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి, ఐటీ, డ్వాక్రా, దీపం, ప్రజల వద్దకు పాలన, నీరు-చెట్టు, పీ-4 ఇలా అనేక నూతన కార్యక్రమాలు సృష్టించి, పరిపాలనలో నూతన ఒరవడి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు.


నెల్లిమర్ల: రవిశేఖర్‌కు కేక్ తినిపిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

చంద్రబాబు హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

నెల్లిమర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. నెల్లిమర్లలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు. ● నెల్లిమర్లలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు కేక్ కట్ చేశారు.

అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవనానికి ఎమ్మెల్యే కళా వెంకటరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ఉన్నారు. తొలుత స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గనుల లీజును రెన్యువల్ చేయండి

గరివిడి, గుర్ల మండలాల పరిధిలో ఉన్న గనుల లీజును పునరుద్ధరించి వాటిలో పని చేస్తున్న సుమారు వెయ్యి మంది కార్మికులకు ఉపాధి కొనసాగించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే కళావెంకటరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు.

సూపర్ సిక్స్ పథకాలు హిట్

చీపురుపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన స్త్రీశక్తి సమావేశంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు పాల్గొని, మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ ఫలితాలిచ్చాయని అన్నారు.

యూపీ ప్రభుత్వంతో సెంచూరియన్ ఒప్పందం


యూపీ డీజీజీ రాజీవ్‌కృష్ణతో ఒప్పందం కుదుర్చుకున్న వర్సిటీ అధ్యాపకులు ముక్తికాంత్ మిశ్రా, వీసీ సుప్రియ పట్నాయక్

పర్లాకిమిండి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ (యూపీ) ప్రభుత్వంతో సెంచూరియన్ యూనివర్సిటీ ఒక చారిత్రక ఒప్పందం కుదుర్చుకుందని వర్సిటీ అధ్యాపకులు మూర్తికాంతి మిశ్రా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29న లక్నోలో జరిగిన సమావేశంలో ఆ రాష్ట్ర ఫోరెన్స్ క్ సైన్స్ ల్యాబోరేటరీ-వర్సిటీ మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా న్యాయ సంబంధిత పరిశోధనాత్మక అంశాల్లో పరస్పర సహకారం అందించుకుంటాయని తెలిపారు. డీజీజీ రాజీవ్ కృష్ణతో కలిసి ఒప్పందం జరిగినట్టు తెలిపారు. మానవవనరుల సౌకర్యాలు అందుబాటులో ఉన్నా శాస్త్రీయ విద్యా నైపుణ్యాన్ని మెరుగుపరడం ఆ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియ పట్నాయక్, యూపీ ల్యాబోరేటరీ ఇన్‌చార్జి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం అద్భుతం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి పథకం అద్భుతమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సోమవారం విజయనగరంలోని మెసానిక్ టెంపుల్లో స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, మహిళా ఎంపీటీసీలు, టీడీపీ మహిళా విభాగం నాయకులు పత్తిగిల్లి సూర్యకుమారి, కొర్నాన రాజ్యలక్ష్మీ, కర్రోతు రాధామణి, కంది శమంతక మణి, ఆల్తి రాధ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

సంతకవిటి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్ల అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రిని శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలోని తన స్వగృహంలో సోమవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మధ్యవర్తులు అధిక ధరలకు అమ్మే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సంతకవిటి పీఏసీఎస్ చైర్మన్ చెలికాని మహేష్ కుమార్, మడ్డువలస ప్రాజెక్ట్ నీటి సంఘం అధ్యక్షుడు పున్నాన రామినాయుడు, వావిలపల్లి రామినాయుడు, గార గున్నంనాయుడు, కరిటి అప్పలరాజు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

గుర్ల/ గంట్యాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు పడ్డాయి. స్పందించిన పోలీసు, రెవెన్యూ సిబ్బంది వాటిని తొలగించే కార్యక్రమాలు చేపట్టారు.

జల దిగ్బంధంలో గర్భాం ఎస్సీ కాలనీ

మెరకముడిదాం: గర్భాం గ్రామంలోని ఎస్సీ కాలనీ సోమవారం కురిసిన వర్షానికి జలమయం అయింది. ఎప్పుడు వర్షం కురిసినా ఈ కాలనీలో ఇదే పరిస్థితి తలెత్తుతోంది. బుదరాయవలసలో కూడా ఇదే పరిస్థితి.

చెరువులా గర్భాం రోడ్డు

గరివిడి: గరివిడి పట్టణంలోని గర్భాం రోడ్డు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షపునీరుతో ఈ రహదారి మొత్తం చెరువుగా మారింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.


మెరకముడిదాం: నీట మునిగిన ఎస్సీ కాలనీ


గరివిడి: చెరువును తలపిస్తున్న గర్భాం రహదారి

వట్టిగెడ్డలో వ్యక్తి గల్లంతు

సాలూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుగ్ధసాగరం సమీపంలోని వట్టిగెడ్డ దాటుతూ వ్యక్తి గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. దుగ్ధసాగరం గ్రామానికి చెందిన ఎం.రామయ్య (45) మధ్యాహ్నం భోజనం చేసి వట్టిగెడ్డ దాటి పొలానికి వెళ్లారు. ఆయన పొలంలో పనిచేసుకుని సాయంత్రం ఇంటికి తిరుగుముఖం పట్టారు. ఎగువప్రాంతంలో కురిసిన భారీవర్షానికి వట్టిగెడ్డకు వరద వచ్చింది. ఆయనకు ఈత రావడంతో ఇంటికి చేరుకోవడానికి వట్టిగెడ్డలో దిగారు. ఈత కొడుతున్న ఆయన వరద ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఆయన ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

కొమరాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన తూతిక సోమేశ్వరరావు(60) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఏడాదిన్నరగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఆయన ప్రతివారం డయాలసిస్ చేయించుకుంటున్నారు. తాజాగా నడుం నొప్పి అధికం కావడంతో జీవితంపై విరక్తితో ఆదివారం గ్రామ శివారులోని దివాన్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య పార్వతీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

తెర్లాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెరుమాళిలో ట్రాక్టర్ బోల్తా పడి పోడ్ల రాము(23) దుర్మరణం చెందాడు. చెరువు వద్ద ట్రాక్టర్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌ను కడిగేందుకు గ్రామ సమీపంలోని చెరువులో రాము దింపాడు. రాముతో పాటు మరికొంతమంది యువకులు ట్రాక్టర్‌ను కడిగేందుకు సాయం చేశారు. చెరువు గట్టుపైకి ట్రాక్టర్‌ను రాము తీసుకు వస్తుండగా మట్టిలో టైర్లు కూరుకుపోయాయి. ట్రాక్టర్ ఒక్కసారిగా పైకి లేవడంతో రాము పక్కకు గెంతేశాడు. దాంతో ఆ ట్రాక్టర్ రాముపై బోల్తా పడింది. కొనఊపిరితో ఉన్న రామును రాజాంలోని ఓ ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

వ్యాను ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లిమర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సారిపల్లి గ్రామంలో వ్యాను ఢీకొని అదే గ్రామానికి చెందిన మజ్జి అన్నపూర్ణ(65) మృతిచెందారు. ఎస్ఐ బి.గణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సారిపల్లి గ్రామంలో తన అల్లుడు సారిపల్లి గురునాయుడు దుకాణం వద్ద అన్నపూర్ణ కూర్చుని ఉన్న సమయంలో కుదిపి వైపు నుంచి వస్తున్న వ్యాను ఆమెను బలంగా ఢీకొంది. దీంతో ఆమె తీవ్ర గాయాలపాలయ్యింది. వెంటనే ఆమెను చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యాను డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

24 కిలోల గంజాయి స్వాధీనం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం 24 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ మురళీధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన రామ్ కిలా, రమేష్ కోరా, సంతోష్ పూజరా, ప్రశాంత్ సోమవారం సాయంత్రం కారులో సుమారు 24 కేజీల గంజాయిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆకాశ్‌కుమార్, వినయ్‌కుమార్, ప్రతాప్‌సింగ్‌లకు అందించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో మాటువేసి పట్టుకున్నామన్నారు. పట్టణంలోని ఫైఓవర్‌కు సమీపంలోని ఓ ప్రైవేట్ లాడ్జి వద్ద పట్టణ ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకున్నారన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు కారు, మోటారు బైక్‌ను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆటో

బొండపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందకపేట జంక్షన్ వద్ద సోమవారం ఆగి ఉన్న ఓ లారీని ఆటో ఢీకొట్టింది. విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న ఆటో.. ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు

రాజాం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తన తల్లి అంపోలు లక్ష్మి పది రోజులుగా కనిపించడం లేదని పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన ఆమె కుమారుడు అంపోలు అఖిల్ రాజాం పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. విజయనగరంలో బుర్రకథ ప్రోగ్రాం ఉందని, నాలుగైదు రోజుల్లో వస్తానని చెప్పి వెళ్లి నేటికీ రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

లక్కవరపుకోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపేట వద్ద గల ఒక మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం దాడి చేశామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. ఈ దాడిలో నలుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.18,860 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కూలిన తాటిచెట్టు

- విరిగిన మూడు స్తంభాలు .. విద్యుత్ సరఫరాకు అంతరాయం


విద్యుత్ తీగలపై పడిన తాటిచెట్టు

కొత్తవలస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ అడ్డూరువానిపాలెం గ్రామంలో రహదారి పక్కన సోమవారం ఓ తాటి చెట్టు విద్యుత్ తీగలపై పడిపోయింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈ కారణంగా సోమవారం సాయంత్రం వరకు వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి, విద్యుత్తును పునరుద్ధరించామని ఏఈ సూరిబాబు తెలిపారు.

ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని బ్రాంచి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. డీసీసీటీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సీనియర్ బీఎం ఎస్.జగదీష్, ఏజెంట్లు పాల్గొన్నారు. ● గరివిడి: ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవాన్ని గరివిడి బ్రాంచి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బోని వెంకటకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో దాడి

(ఐదో పేజీ తరువాయి)

అతని వెంట పడ్డారు. తనను ఎందుకు వెంబడిస్తున్నారని ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా దాడి చేశారు. శివమణి దెబ్బలు కాస్తూ బతిమలాడాడు. అయినా సరే మత్తులో ఉన్న ఆ నలుగురు అతనిని కొట్టడం కొనసాగించారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిలో కొందరు శివమణిని రక్షించేందుకు ప్రయత్నించినా వారు వినడం లేదు. దీంతో రాజాం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకునేసరికి ఆ నలుగురూ పరారయ్యారు. ఇదే విషయాన్ని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఓ యువకుడిని నలుగురు కొట్టడం తన దృష్టికి వచ్చిందని, వారిని గుర్తించామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారు మద్యం సేవించారా, గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డారా తెలియాల్సి ఉందని సీఐ అశోక్ స్పష్టం చేశారు.

● విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ ఇంజినీరింగ్ తదితర యువతకు గంజాయిని విక్రయిస్తూ పట్టుబడిన సంఘటనలు రాజాం నియోజకవర్గ పరిధిలో చాలా జరిగాయి. పోలీసుల కళ్లుకప్పి చాటుమాటుగా గంజాయి సేవిస్తున్నారు. తాజాగా గంజాయి మత్తులో అందరూ తిరుగాడే బహిరంగ ప్రదేశంలో ఓ వైద్య విద్యార్థిపై దాడి చేయడమే కాకుండా అడ్డొచ్చే వారిపై విరుచుకుపడి భయాందోళన సృష్టించారు.

● యువకుల దాడికి గురైన వైద్య విద్యార్థి పోలీసుల్ని ఆశ్రయించేందుకు తొలుత వెనుకంజ వేసినా ఆదివారం రాత్రి పది గంటల తరువాత పోలీసులకు గోడు వెళ్లబోసుకున్నాడు. తనపై అకారణంగా దాడిచేశారని, వారెవ్వరో తనకు తెలియదని విలేకరులకు సైతం వివరించాడు. దీంతో రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజిల్ని సేకరించాక యువకుడిని కొట్టినవారిని గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు.

పైడిమాంబ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

(ఐదో పేజీ తరువాయి)

అభివృద్ధి ఏ విధంగా చేయాలన్న దానిపై డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)సిద్ధమౌతున్నదన్నారు. రాష్ట్రంలో ఆలయాలకు పూర్తి రక్షణ ఉందని, ఏడాదిన్నర ప్రభుత్వ కాలంలో ఏ దేవాలయం ధ్వంసం కాలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదని, ఐదేళ్ల ఆ ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో ఎన్నో దేవాలయాలు ధ్వంసం అయ్యాయన్నారు. ఈనేపథ్యం లోనే ప్రజలు ధ్వంసాలకు పాల్పడే ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపారన్నారు. భవిష్యత్తులో మళ్లీ ధ్వంసాలు చేసే ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటే ఈ రాష్ట్రం, రాష్ట్రంలో ఉన్న ఆలయాలు గోవిందా..గోవిందేనని ఆయన ఎద్దేవా చేశారు.

సిరిమాను జాతరకు పక్కా ఏర్పాట్లు

(ఐదో పేజీ తరువాయి)

రోప్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. రూ.3 లక్షల 20 వేలతో జనరేటర్లు, ఫ్లడ్ లైట్లను అద్దె ప్రాతిపదికన రప్పించనున్నామన్నారు. రూ.5 లక్షలతో 300 మంది పారిశుధ్య ప్రత్యేక బృందాన్ని వినియోగించనున్నట్టు తెలిపారు. అలాగే రూ.4 లక్షల 50 వేలతో పాటు ప్రత్యేక పారిశుధ్య పనిముట్లు, ఇతర సామగ్రి కొనుగోలుకు వినియోగించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు రంగులు వేసే ప్రక్రియ ప్రారంభమైందని, నిర్దేశిత పనులన్నీ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్టు స్పష్టంచేశారు.

నిరుపేదలకు అండగా అన్నా క్యాంటీన్

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించామని, ఇచ్చిన హామీలను ఏడాదిలో అమలు చేశామని, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పథకాలన్నీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీవీవీ గోపాలరాజు, లెంక బంగారునాయుడు, సర్పంచ్ నరవ కొండమ్మ, ఎంపీడీవో పుష్పలత, తహసీల్దార్ బి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల కదలికలపై పరిశీలన

(ఐదో పేజీ తరువాయి)

ఇష్టపడుతున్నాయి? ఏ సమయంలో ఎటువైపు సంచరిస్తున్నాయన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించి.. వాటి ఆలోచనలను ముందస్తుగా అటవీశాఖాధికారులు గ్రహించి ప్రజలను అప్రమత్తం చేయాలని శాంతి ప్రియపాండే ఆదేశించారు. వాటి బారిన ఎవరూ పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం వాటి తరలింపు అంశంపై చర్చించారు. ఏనుగుల వల్ల పంటలను నష్టపోతున్నామని, తమను ఆదుకోవాలని పలువురు రైతులు బృంద సభ్యులను కోరారు. ఈ పరిశీలనలో డీఎఫ్‌వో ప్రసూన, పార్వతీపురం రేంజ్ అధికారి మణికంఠేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాలాడలో పర్యటించిన బృందం

భామిని: తాలాడ గ్రామంలోని ఏనుగులు సంచరించే ఐలాంతోట, వంశధార నది తీర ప్రాంతాన్ని కూడా అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి శాంతి ప్రియపాండే, కేంద్ర నిపుణుల బృందం పరిశీలించింది. తొలిసారిగా కేంద్ర బృందం పర్యటించడంతో ఇకనైనా ఏనుగుల బెడద నుంచి రక్షించాలని మండలవాసులు కోరుతున్నారు. సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, పాలకొండ రేంజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు.. రైతు కంట కన్నీళ్లు

(ఐదో పేజీ తరువాయి)

రైతులకు ఇస్తారు. రైతులు తమ కోళ్ల ఫారాలలో కోడిపిల్లలను 45 రోజుల నుంచి 50 రోజుల వరకు పెంచుతారు. ఫారాలు నిర్వహణ, లేబర్ చార్జీలు, విద్యుత్ వంటివి యజమానులే భరించాల్సి ఉంటుంది. కోళ్లు పెరిగిన తరువాత వీటిని హేచరీస్ సంస్థలకే తిరిగి ఎగుమతి చేస్తారు. ఇందుకు హేచరీస్ యజమానులు కేజీల లెక్కన లెక్క కట్టి డబ్బులను కోళ్ల ఫారాల యజమానుల అకౌంట్‌లలో జమ చేస్తారు. వారం రోజుల కిందట నుంచి కోళ్లు అంతు చిక్కని వ్యాధితో మృత్యువాత పడుతుండడంతో ఇటు కోళ్లను పెంచిన యజమానులు పూర్తిగా నష్టపోగా హేచరీస్ సంస్థల యజమానులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ వారం రోజులలో 8 లక్షల వరకు కోళ్లు మృత్యువాత పడినట్టు రైతులు చెబుతున్నారు. ఇప్పటికీ మృతి చెందుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొచ్చి ఫారాలను ఏర్పాటు చేసుకుంటే ఈ అంతు చిక్కని వ్యాధి తమకు నష్టాలను తెచ్చి పెట్టిందంటున్నారు.

నమూనాలను ల్యాబ్‌కు పంపించాం

అంతుచిక్కని వ్యాధితో కోళ్లఫారాల్లో కోళ్లు చనిపోతున్నట్టు గత నెల 28 నుంచి మాకు రైతుల నుంచి సమాచారం వచ్చింది. వెంటనే వైద్యులతో గ్రామాలకు వెళ్లి మృత్యువాత పడుతున్న కోళ్లను పరిశీలించాం. నమూనాలను సేకరించి విజయవాడ ల్యాబ్‌కు పంపించాం. నిర్ధారణ జరిగాక చర్యలు తీసుకుంటాం.

- కన్నంనాయుడు, ఏడీ, కొత్తవలస పశుసంవర్థకశాఖ

పోస్టు బాక్సుల తొలగింపు అవాస్తవం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోస్టుబాక్సు సేవలను పూర్తిగా తొలగిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని పోస్టల్‌శాఖ సూపరిడెంట్ కె.శ్రీనివాసు స్పష్టం చేశారు. నగరంలోని కోట వెనుక ఉన్న తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 180 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. అలాగే పోస్టుకార్డులు, ఎన్వలప్‌లు, ఇన్‌లాండ్ లేటర్స్ యథావిధిగానే విక్రయాలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో అవాస్తవాలు నమ్మొద్దని తెలిపారు. అలాగే సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్టుల సేవలు నిలిపివేసి వాటిని స్పీడు పోస్టులో విలీనం చేయనున్నట్టు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్టు పేరుతో సేవలు ఉండవన్నారు.

'స్విమ్స్' చర్చి 150 వసంతాల వేడుకలు

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో అతి పెద్ద క్రైస్తవ స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150వ వసంతాల వేడుకలను ఈనెల 9వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక చర్చి ఆవరణలో వేడుకల నిర్వహక ప్రతినిధి డా.ఆర్ఎస్ జాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్రైస్తవ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రగతి ప్రదాత



ప్రజా సమస్యలను వింటున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు తెలుగు రాష్ట్రాల ప్రగతి ప్రదాత అని ఎమ్మెల్యే బేబీనాయన కొనియాడారు. ముఖ్యమంత్రిగా 30 ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ అని కీర్తించారు. ఆయన సారథ్యంలో పనిచేసేందుకు నాకు అవకాశం కల్పించిన బొబ్బిలి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు మండలంలోని రంగప్పవలసలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, రంగప్పవలస నుంచి తమ్మయ్యవలస రహదారిని బాగుచేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు మర్రాపు శంకరరావు, కరణం రమేశ్, శనపతి కృష్ణ, సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

● బొబ్బిలి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం ఉదయం ఎమ్మెల్యే బేబీనాయన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలరు, తెలుగు మహిళా నాయకురాలు వెలగాడ హైమావతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు బొబ్బిలి కోటలో జాబ్ మేళా..

ఈ నెల 3 న బొబ్బిలి కోటలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఏటా రెండుసార్లు జాబ్ మేళాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అపోలో ఫార్మసీ, డెక్కన్ సిమెంట్స్ హెటిరో, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, డెక్కన్ ఫైనాన్స్, పేటీఎం, యోకోమా, సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్, ఆక్టినోస్ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

పేదల బతుకులకు భరోసా

●బాడంగి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీతో పేదల బతుకుల్లో కూటమి ప్రభుత్వం భరోసా నింపుతోందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. సోమవారం వాడాడలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, అర్నెపల్లి అచ్యుతరావు, రెడ్డి త్రినాథ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు



మాట్లాడుతున్న సెక్టర్ సూపర్‌వైజర్ పద్మ

బొబ్బిలి రూరల్,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) - పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. మండలంలోని రంగరాయపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. వారోత్సవాలలో చెల్లారపువలస, కునుకువానివలస, రంగరాయపురం గ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పోలమ్మ, సంహాచలం, రామలక్ష్మీ, నారాయణమ్మ, భారతి, సంధ్య పాల్గొన్నారు.

నిమజ్జనాలు శాంతియుతంగా చేపట్టండి



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు సూచించారు. మండలంలోని పాతరేగలో సోమవారం సాయంత్రం ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నిమజ్జన ఊరేగింపులో ట్రాఫిక్ నియంత్రణ పాటించాలన్నారు. ఊరేగింపులో వివాదాస్పద గీతాలు, అసహజమైన చర్యలు నిరోధించాలన్నారు. ఊరేగింపులో మద్యపానం, మత్తు పదార్థాల వినియోగిస్తే కమిటీ ప్రతినిధులే బాధ్యత వహించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జనం జరిగేలా చూడాలని నిర్వాహకులకు సీఐ సూచించారు.

బార్లు... బోర్లా!

(ఐదో పేజీ తరువాయి)

మునిసిపాలిటీలలో బార్ల ఏర్పాటుకు ఒక్కో దరఖాస్తు మాత్రమే రావడంతో ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు ఖంగుతిన్నారు. ఏటా ఎంతకైనా బార్లను దక్కించుకునే మద్యం వ్యాపారులు ఈసారి బార్ల కోసం ఎందుకు దరఖాస్తు చేయలేదో అధికారులకే అంతుపట్టని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే రాజాం, బొబ్బిలితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో బార్ల నిర్వహణలో కింగ్‌గా పేరొందిన ఓ వ్యాపారి రాజాంలో తన బార్ భవనాన్ని అద్దెకిస్తామని లేదా అమ్మేస్తామని బార్ ఎదుట బ్యానర్ కట్టారంటే బార్లలో మద్యం వ్యాపారం లాభసాటిగా లేదని స్పష్టమవుతోంది.

కొంపతీసిన పర్మిట్‌రూంలు..

వైన్‌షాపులకు ఆనుకుని పర్మిట్‌రూంలు కేటాయిస్తామని ప్రభుత్వ తాజా ప్రకటన ప్రభావం బార్లపై పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బార్ల వ్యాపారం మూడు పెగ్గులు, ఆరు ఔన్స్‌ల చందంగా సాగింది. అప్పట్లో వైన్‌షాపులను ప్రభుత్వమే నిర్వహించడం, షాపుల సమయాలు ఇష్టారాజ్యంగా నిర్ణయించడం, షాపుల్లో జె బ్రాండ్లు తప్ప ప్రీమియం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో మద్యం ప్రియులంతా బార్లను ఆశ్రయించేవారు. ధర ఎక్కువైనా సరే నచ్చిన సమయంలో ఏసీలో కూచుని నచ్చిన బ్రాండ్ సేవించేవారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వైన్‌షాపుల్లో కూడా ప్రీమియం బ్రాండ్లు అందుబాటులో ఉండడం, ధర కూడా కాస్త అటుఇటుగా ఉండడంతో బార్లవైపు మద్యం ప్రియులు కన్నెత్తి చూడడం మానేసారు. దీంతో లక్షలు వెచ్చించి, రూపాయలు వసూలు చేసుకోవడం అవసరమా అనే భావన బార్ల నిర్వాహకుల్లో నెలకొనడంతో వాటి ఏర్పాటుకు మొగ్గు చూపలేదని స్పష్టమవుతోంది.

ఇదో కొత్త ట్రెండ్...

జిల్లాలో ప్రధాన పట్టణాలలో కొత్త ట్రెండ్‌కు మద్యం వ్యాపారులు తెరలేపుతున్నారు. గతంలో బార్లు నిర్వహించిన భవనాల్లోకి మద్యం షాపులను షిఫ్ట్ చేసేందుకు జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలిలో సన్నాహాలు ప్రారంభించారు. గతంలో బార్ నిర్వహించిన భవనానికి సంబంధించి పర్మిట్‌రూంకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అన్ని హంగులతో కూడిన భవనంలో తక్కువ ధరకే ఎంచక్కా మద్యం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

● జిల్లాలో మద్యం వ్యాపారులు మరోసారి సిండికేటయ్యారు. జనరల్ బార్ల కన్నా గీత కార్మికులకు కేటాయించిన బార్లకు డిమాండ్ పెరగడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. గీత కార్మికుల పేరుతో మద్యం వ్యాపారులు బార్‌ను దక్కించుకుని వారికి తృణమో ఫణమో చెల్లించి ప్రభుత్వ ఫీజులు, నాన్ రిఫండబుల్ ఫీజును వార్షిక ఫీజుల నుంచి రాయితీ పొందవచ్చన్న దురాలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన వైన్‌షాపులను కూడా మద్యం సిండికేట్ కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

పింఛన్ల పంపిణీ ఆలస్యంపై విచారణ

రేగిడి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంకిలి సచివాలయంలో సోమవారం మధ్యాహ్నానికి సుమారు 150మందికి పింఛన్లు పంపిణీ కాలేదు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లింది. ఎంపీడీవో శ్యామలాకుమారి ఆదేశాలతో వెలుగు ఏపీఎం గోవిందరావు వెంటనే ఆ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోగా, కొంతమంది పింఛన్‌దారులు సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. పింఛన్‌దారులు ఏపీఎం ఎదుట తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. సిబ్బంది కొరత కారణంగా ఈ పరిస్థితి వచ్చినట్టు ఏపీఎం ఎంపీడీవోకు నివేదించారు. ఈమేరకు ఎంపీడీవో.. వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఫోన్‌లో వివరణ కోరారు. అలాగే సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీఎంను ఆదేశించారు.

అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు

నెల్లిమర్ల, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): తంగుడుబిల్లి గ్రామంలోని తన సొంత భూమిలో కొంతమంది మట్టిని తీసి గట్టుగా ఏర్పాటు చేసి చెరువుగా మార్చేందుకు కుట్ర పన్నారని ఆ గ్రామానికి చెందిన పాలూరి ఆదినారాయణ స్థానిక తహసీల్దార్‌కు, నెల్లిమర్ల పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన వద్ద అన్నిపత్రాలు ఉన్నాయని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆకలి మంటలు తీర్చండి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు

రామభద్రపురం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల ఆకలి మంటలు తీర్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు బలసా శ్రీను ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రీన్ అంబాసిడర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఒక్కొక్క పంచాయతీలో 18 నెలలు, 8 నెలలు, 6 నెలలు జీతాల బకాయిలు ఇవ్వాల్సి ఉందన్నారు. దానివల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. నెలకు రూ.6వేల చాలీచాలని జీతాలతో ఈ ఉద్యోగం చేస్తున్నామని, రిక్షాబళ్ల రిపేర్లకు కూడా నిధులు మంజూరు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేలు కూడా నేరుగా తమ అకౌంట్‌కు కాకుండా సర్పంచ్ అకౌంట్‌కు జమచేయడంతో ఇక్కట్లు పడుతున్నామన్నారు. సర్పంచ్‌లు సకాలంలో ఇవ్వకుండా బకాయిలు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఘనంగా పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలసల సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ దంపతులు దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట వేశారు. వేద పండితుడు ఆంజనేయ శర్మ పూజాదికాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.నాగరాజు దంపతులు, మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు మరడ రామినాయుడు దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో స్వీకరించిన అర్జీలను వెంటనే క్లియర్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్ ఎం.శ్రీను అధికారులను ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ సాయికృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బెలగాం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వ ఒత్తిళ్లను నిర్బంధాలు, దాడులను ఎదుర్కొని విధులు నిర్వహిస్తున్నామన్నారు. పని భారాన్ని తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.అమరవేణి, సత్య, ఉమామహేశ్వరి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

ఎస్.కోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకానికి వ్యతిరేకంగా ఎస్.కోటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఆటోడ్రైవర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ చేసి, మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

భోగాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం తగరపువలసలో నూతనంగా నిర్మిస్తున్న ఉమారామలింగేశ్వర, అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. సోమవారం పోలిపల్లి గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

జిందాల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమల ఏర్పాటు పేరుతో తమ నుంచి భూములు సేకరించిన యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని హరిజన, గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బొడ్డవర గ్రామం వద్ద నిరసన చేపట్టారు.

నాణ్యమైన విద్యను అందించాలి

వేపాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బాలభాస్కరరావు అన్నారు. చినదుంగాడ పాఠశాలను ఆయన సోమవారం పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి, తెలుసుకున్నారు. ఎండీఎం ఆహార పదార్థాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డివిజన్ పరిధిలోని 33 కేవీ సబ్ స్టేషన్, పారాది, నారసింహునిపేట సబ్‌స్టేషన్ల నుంచి వచ్చే 11 కేవీ మెట్టవలస ఫీడర్, చిత్రకోట బొడ్డవలస ఫీడర్ల పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నామన్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● బాడంగి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యల పరిష్కారం దృష్ట్యా 33 కేవీ పినపెంకి ఎస్ఎస్ పరిధిలోని 11కేవీ ఆనవరం ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు బొత్సవానివలస, ఆనవరం, అల్లుపాల్తేరు, హెచ్.పాల్తేరు, పాల్తేరు, పాల్తేరు ఆర్‌డబ్ల్యుఎస్‌లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

రామభద్రపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కొండకెంగువ గ్రామానికి చెందిన అంపోలు జనార్దనరావుకు సాలూరు న్యాయాధికారి హర్షవర్ధన్ రూ.10వేల జరిమానా విధించారని ఎస్ఐ వెలమల ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే శిక్ష తప్పదని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

తెర్లాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చుక్కవలసకు చెందిన దత్తి వాసు సోమవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామంలో వాసు చిన్నపాటి విద్యుత్ పనులను చేస్తుంటాడు. అయితే సోమవారం గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం గమనించిన స్థానికులు వాసును 108 వాహనంలో రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నానో యూరియా వాడకంతో మేలు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు. సోమవారం మండలంలోని పారాదిలో నానో యూరియా, నానో డీఏపీ పిచికారీని ఆయన పరిశీలించారు. వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి లేదా ప్రత్తి పంటలో మొదటి దఫా ఎరువు వేసిన తర్వాత రెండో దఫా కేవలం నానో యూరియా లేదా నానో డీఏపీ వాడటం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మల్లేశ్వరరావు

పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యుడిగా కురుపాం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన యువజన సంఘాల సమైక్య నాయకుడిగా గత 15 నెలలుగా కొనసాగారు. ఆ తర్వాత జనసేన పార్టీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన సేవలకు పార్టీ గుర్తించి కూటమి ప్రభుత్వం ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎంపిక చేసింది. మల్లేశ్వరరావు ఎంపికపై కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

బెలగాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తల్లిపై బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అనుచిత వాఖ్యలు చేయడం దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ వాఖ్యలు ఖండిస్తూ పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద బీజేపీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మోదీ తల్లిని అవమానించడమంటే దేశంలోని మహిళలను అవమానించినట్టేనన్నారు. వెంటనే రాహుల్ గాంధీ ఎంపీ పదవిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు వి.పార్వతి, నాయకులు సంజీవులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

భోగాపురం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రావాడ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంఏ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జాతీయ స్థాయి 9వ లేజర్ రన్ చాంపియన్‌షిప్-2025 పోటీలు బీహార్ రాష్ట్రం బిగుసరాయ్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు బి.దిలీప్‌కుమార్, వి.సాయికిరణ్, ఎ.భీష్మ, ఎ.మేఘన, ఎ.నక్షత్ర విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.